# ఇది కూడా ఖరీదే!

- కె.బి.కృష్ణ

సాయంత్రం ఆరుగంటలు కావస్తూంది. రాజమండ్రి గుండువారివీధిలో శేర్ చమన్‌లాల్ జ్యూయలరీ షాపు చాలారద్దీగా వుంది.

ఈలోగా-

ఒక మారుతీ 1000 సీసీ కారు వచ్చి షాపు ముందు ఆగింది. రాష్ట్రంలో చిత్రసీమలో నెంబర్‌వన్ బ్యూటీక్వీన్ జయశ్రీ అందులోనుంచి దిగింది. సుమారు ఐదున్నర అడుగుల ఎత్తులో, వంపు సొంపుల వయ్యారాలతో, కనకాంబరపు రంగు చీరలో నిండుగా కట్టిన కనకాంబరపు పూలదండలా వుంది. ఆమె ప్రవేశంతో షాపులోవున్న జనం అంతా ఎలర్ట్ అయిపోయారు.

రాజమండ్రి దగ్గర బొబ్బర్లంకలో షూటింగ్‌కు జయశ్రీ వచ్చిందనీ, ఆనంద్ రీజెన్సీలో దిగిందనీ విన్నాడుకానీ, ఇలా తమ షాపుకు వస్తుందని శేర్ చమన్‌లాల్ అనుకోలేదు.

ఎయిర్ కండిషన్ షోరూమ్‌లో ఆమె ప్రవేశించి, తన బ్యాగ్‌లోంచి, బంగారు పట్టీలు తీసి శేర్‌కి ఇచ్చింది. మామిడిపిందెల బంగారు పట్టీలు మెరిసిపోతున్నాయి.

''శేర్‌జీ ఒక పట్టీ తెగిపోయింది. నేను ఒక అరగంట కూచుంటాను, దయచేసి ఈ పట్టీ అతికించి తెప్పించరూ-'' అంటూ ఒక్కసారి శరీరమంతా వయ్యారంగా ప్రక్కకు తిరిగేట్లు ఊగింది.

తన శరీరమంతా విద్యుత్ ఆవరించినట్లు శేర్‌జీకి మైకం కమ్మింది.

ఈలోగా షోరూమ్‌లోకి చాలామంది దంపతులు వచ్చి జయశ్రీని ఓరకంటితో చూస్తూ, ఆనందిస్తూ, అవసరంవున్నా లేకపోయినా షాపులో ఏదో ఒకటి కొనిపోతున్నారు.

''మేడం ముక్కుపుడకలు లేటెస్ట్ వచ్చాయి. చూస్తారా?'' అన్నాడు శేర్‌జీ.

''అలాగే'' అంది తన ముక్కుకు వున్న ఎర్రని రాయి మెరిసిపోయేట్లుగా మూతి ముక్కు తిప్పుకుంటూ.

అయ్యో తను ఆ ముక్కుపుడకలోని ఎర్రని రాయినైనా కాకపోతిని అనుకున్నాడు శేర్‌జీ.

అమ్మా ఇది కెంపుతో చేసింది-

ఇది మేలు ముత్యంతో చేసింది-

ఇది చూశారు- అతి చిన్నవైన పుష్యరాగాలతో ఫ్లవర్ డిజైన్ చేశాం. చాలా తేలికగా వుంటుంది-

ఇది రవ్వతో చేసింది- అంటూ శేర్‌జీ ముక్కుపుడకలన్నీ చూపిస్తున్నాడు.

అన్నీ చూసి ''అన్నీ ప్యాక్ చేయించండి'' అంది జయశ్రీ.

శేర్‌జీ మురిసిపోయి- ''తమరు మా షాపుకే ఎందుకువచ్చారు?''

''ఏంలేదు. వెరీ సింపుల్. ఏంతోచక రిలాక్స్ అవుదామని సిటీకేబుల్ చూస్తుంటే, మీ షాపు ప్రకటన వచ్చింది. డంగైపోయానంటే నమ్మండి. రాజమండ్రిలో ఇంత పెద్దషాపు వుందా! నిజమా కాదా, అని చూద్దామని వచ్చాను. గబగబా వస్తుంటే ఒక కాలి పట్టా తెగింది. మీ షాపు చూసినట్లుంటుందని ఇలా వచ్చేశాను.''



''థ్యాంక్యూ మేడమ్'' అంటూ శేర్‌జీ బాదంషేర్ గ్లాసు జయశ్రీకి ఇస్తూ, ఆమె వేళ్ళను సుతారంగా అంటుకుని చంద్రమండలం వెళ్ళినంత అనుభూతి పొందేడు. ఈలోగా పట్టా రిపేరు అయి వచ్చింది.

''ఇదిగో మేడమ్ చూసుకోండి సరిపోయాయో లేదో-'' అన్నాడు.

ఆమె సోఫాలో కూర్చుని చీర కొంచం పైకి లాక్కుని పచ్చని కాళ్ళకు పట్టీలు పెట్టుకుంది. షాపులో అందరు కళ్ళప్పగించి ఆమెనే చూడసాగేరు.

శేర్‌జీ, రేపటి నుండి తన వ్యాపారం ఎలా ఎదిగిపోతుందోనని సంబరపడి పోతున్నాడు. వీడియో తీయిద్దామంటే టైము లేదని మధనపడ్డాడు.

''శేర్‌జీ, థ్యాంక్యూ మరి సెలవిస్తారా? పట్టాలకు రిపేరు ఛార్జీ'' అంది. ఆమె మాటలు పూర్తికాకుండానే, ఎలాగూ ముక్కుపుడకలకు డబ్బులిస్తుంది కదా, అందులో రిపేర్ ఛార్జీలు నొక్కెయ్యచ్చని అనుకుంటూ ''వొద్దు మేడమ్ మీరు రావడమే మాకు భాగ్యం'' అన్నాడు. ఆమె వయ్యారాలు వొలకబోసుకుంటూ కారుదగ్గరకు వెళ్తుంటే కారుదాకా వెళ్ళి, శేర్‌జీ తడబడుతూ-

''మేడమ్, ముక్కుపుడకలకు ముప్పైఐదువేలు చెక్కు పంపిస్తారా?'' అతని మాటలు పూర్తికాకుండానే

''యూసిల్లీ శేర్‌జీ. మీషాపులో ఎంతసేపు వున్నాను? నీకు ఆ సమయంలో ఎంత గిరాకీ వచ్చింది? నా సమయం ఎంత విలువైందో తెలుసా?- డ్రైవర్ పోనియ్'' అంది- అంతే-

దుమ్ముకొట్టుకుంటూ మారుతి వెళ్ళిపోయింది. శేర్‌జీ ఆర్థిక ఆత్మ కూడా కారువెంటే వెళ్ళిపోయింది.

★